సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 12 । జనవరి । 2024



బస్సులు, రైళ్లు కిటకిట



8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ విశాఖ లోక్‌సభ ఇన్‌చార్జిగా బొత్స ఝాన్సీలక్ష్మి



సాక్షి, విశాఖపట్నం : బీసీలకు, మహిళలకు పెద్దపీట వేస్తున్న వైఎస్సార్ సీపీ ఈ సారి విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా తూర్పుకాపు సామాజిక వర్గానికి చెందిన బొత్స ఝాన్సీలక్ష్మిని నియమించింది. ఆమె వైఎస్సార్ సీపీ సీనియర్ రాజకీయ నాయకుడు బొత్స సత్యనారాయణ భార్య. రాజకీయ నాయకురాలిగానే గాకుండా ఉన్నత విద్యావంతురాలిగా, విద్యాసంస్థ నిర్వాహకురాలిగా సుపరిచితురాలు. ఎంఏ ఫిలాసఫీ, ఎల్ఎల్‌బీ, న్యాయ విద్యలో రెండు పీహెచ్‌డీలు పూర్తిచేశారు. ఏపీ హైకోర్టు న్యాయవాదిగా పనిచేశారు. ఉత్తరాంధ్రలో పలు సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ ఆమె ఎప్పుడూ ముందుంటారు. 2001 నుంచి 2006 వరకు విజయనగరం జెడ్పీచైర్‌పర్సన్‌గా పనిచేశారు. 2007లో బొబ్బిలి లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో విజయం సాధించారు. రెండోసారి 2009లో విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గంలో పోటీచేసి గెలిచారు. 2010లో ఇండియన్ పార్లమెంటరీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, ఎంజీఎన్ఆర్‌జీఏ సబ్ కమిటీ చైర్మన్‌గా వివిధ పదవులు నిర్వర్తించారు. ఇప్పుడు విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా ఆమెకు కీలక బాధ్యతలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కొండా రాజీవ్



సాక్షి, విశాఖపట్నం: విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కొండా రాజీవ్ గాంధీ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ తనని ఈ పదవిలో నియమించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాజీవ్ గాంధీ వైఎస్సార్ సీపీలో రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. ప్రస్తుతం పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

10 వైద్య శిబిరాల్లో 4,021 మందికి సేవలు



కొబ్బరితోటలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా గురువారం అర్బన్‌లోని 10 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. బక్కన్నపాలెం, బాలాజీనగర్–2, గంగవరం, ఇందిరాకాలనీ, ఇసుకతోట, కొబ్బరితోట, జబ్బరితోట, నరసింహనగర్, రైల్వే న్యూకాలనీ, గ్రామికనగర్‌లో నిర్వహించిన శిబిరాల్లో 4,021 మందికి వైద్య సేవలందించారు. ఇందులో 14 రిఫరల్ కేసులను వివిధ కార్పొరేట్ ఆస్పత్రులకు పంపారు. శిబిరాల్లో రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం పెందుర్తి మండలం గొరపల్లిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీ సహకారంతో నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్‌బిల్డింగ్(సెమ్స్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీకృష్ణ శివం తెలిపారు. అభ్యర్థులు 27 ఏళ్ల లోపు వయసు కలిగి పది, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, డిప్లమో ఇన్ మెకానికల్, ఎలక్ట్రికల్‌లో ఉత్తీర్ణులై ఉండాలని స్పష్టం చేశారు. విశాఖ పోర్టు పరిసర ప్రాంతాల(వన్‌టౌన్, కోట వీధి, పాత పోస్టాఫీస్, జాలారిపేట, అల్లిపురం, కొబ్బరితోట, మహారాణిపేట, పందిమెట్ట, జ్ఞానాపురం, 75 ఫీట్ రోడ్, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ, గొల్లవీధి) పరిధిలోని నిరుద్యోగ యువతకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. కొరియర్ సూపర్‌వైజర్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, పిక్కర్, ఇన్వెంటరీ కంట్రోలర్, సీఎన్‌సీ ఆపరేటర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో 3 నెలల ఉచిత శిక్షణతో పాటు ఉపాధి సహకారం అందిస్తామన్నారు. అభ్యర్థులు 9948183865, 7794840934, 0891-2704010 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

తగ్గేదేలే..

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖకు 4వ ర్యాంక్



విశ్వ విశాఖ.. మరోసారి కీర్తి పతాక ఎగరేసింది. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో నాలుగో ర్యాంక్ సాధించి జాతీయ స్థాయిలో మరోమారు మెరిసింది. 2018–19లో 23వ ర్యాంక్‌కు పడిపోయిన విశాఖ.. పడిలేచిన కెరటంలా దూసుకొచ్చింది. రెండేళ్ల కిందట 9వ ర్యాంక్ సాధించిన జీవీఎంసీ గతేడాది 4వ ర్యాంక్‌కు ఎదిగింది. తాజాగా అఖిల భారత స్థాయిలో ఆ స్థానాన్ని నిలబెట్టుకుంది. పారిశుధ్యం నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన, మరుగుదొడ్ల నిర్వహణ, రవాణా వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, ప్లాస్టిక్ నిషేధం తదితర వాటిని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం.. ఈ ర్యాంక్‌ను ప్రకటించింది. అలాగే చెత్త రహిత నగరాల్లో విశాఖపట్నం 5 స్టార్ రేటింగ్ సాధించింది. వాటర్ ప్లస్ సర్టిఫికేషన్‌లో కూడా జీవీఎంసీ గుర్తింపు పొందింది. – డాబాగార్డెన్స్

దేశ వ్యాప్తంగా పరిశుభ్రమైన నగరాలకు ఏటా కేంద్ర ప్రభుత్వం ర్యాంక్‌లు అందజేస్తోంది. నగరాల్లో ఉండే మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం నిర్వహణ, బహిరంగ మలమూత్ర విసర్జన నిర్మూలన, ఇళ్లల్లో మరుగుదొడ్ల నిర్మాణం, రవాణా వ్యవస్థ, చెత్త శుద్ధి, బీచ్ క్లీన్, పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని 'స్వచ్ఛ' అవార్డులకు నగరాలకు ఎంపిక చేస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాదికి గానూ గురువారం దేశ రాజధాని ఢిల్లీలో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్‌లు ప్రకటించారు. 2022–23కి గానూ 4,472 సిటీస్‌తో తలపడిన విశాఖ మహా నగరం.. మరోసారి సత్తా చాటి టాప్–5 నగరాల జాబితాలో నిలిచింది. గతేడాది 4వ స్థానంలో నిలిచిన జీవీఎంసీ ఈ ఏడాది కూడా అదే(4వ స్థానం) స్థానం సాధించింది. ఇండోర్(మధ్యప్రదేశ్), సూరత్(గుజరాత్), నవీ ముంబయి(మహారాష్ట్ర) తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. తర్వాత స్థానంలో మన విశాఖ నిలవడం మనందరికీ గర్వకారణం.



కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ సన్యాసిరావు, సీఈ రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్

- 4,472 నగరాలతో పోటీ పడి ర్యాంక్ సాధించిన వైజాగ్
- రాష్ట్రం నుంచి టాప్–1లో నిలిచిన జీవీఎంసీ
- గార్బేజ్ రేటింగ్‌లో 5 స్టార్ రేటింగ్
- వాటర్ ప్లస్‌లో గుర్తింపు పొందిన మహానగరం

ఫలించిన 'స్వచ్ఛ' ప్రయత్నం

జీవీఎంసీ అధికారులు, పారిశుధ్య సిబ్బంది, నగర ప్రజల ప్రయత్నం ఫలించింది. విశాఖ నాలుగో ర్యాంక్ సాధించడంపై నగర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ డాక్టర్ సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు తదితరులు కేంద్ర గృహ పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు. ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు సెక్రటరీ, పారిశుధ్య కార్మికుడు ఢిల్లీ వెళ్లిన బృందంలో ఉన్నారు.



యంత్రాల ద్వారా బీచ్ క్లీనింగ్

స్వచ్ఛతలో విశాఖ మెరిసిందిలా...

సంవత్సరం	ర్యాంక్
2018–19	23
2019–20	09
2020–21	09
2021–22	04
2022–23	04

శతశాతం క్లీన్ సిటీ విశాఖ

స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీ నిబంధనలను జీవీఎంసీ 100 శాతం పాటిస్తుంది. పారిశుధ్యం నిర్వహణలో రాజీ పడటం లేదు. గత ర్యాంక్‌ను అధిగమించిందుకు వినూత్న చర్యలు చేపట్టాం. వచ్చే ఏడాది మరింత మెరుగైన ర్యాంక్ కోసం ఇప్పటినుంచే చర్యలు చేపడతాం. పారిశుధ్య కార్మికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏఎంహెచ్‌వోలు, జెడ్సీలు, నివాసిత సంక్షేమ సంఘాలు, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్‌లు, ఎన్జీవోల సమష్టి కృషితో ఈ ర్యాంక్ సొంతం చేసుకున్నందుకు సంతోషంగా ఉంది.

– డాక్టర్ నరేష్‌కుమార్, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి

8879.25 / 9500

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్స్–2023లో 9,500 స్కోర్‌కి 8879.25 మార్కులను విశాఖ సాధించింది.

విభాగం	మొత్తం మార్కులు	సాధించిన మార్కులు
సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్	4830	4529.13
సర్టిఫికేషన్	2500	2300.00
సిటిజన్ వాయిస్	2170	2050.12



సమష్టి కృషితో ర్యాంక్ సాధించాం



స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో జీవీఎంసీ 4వ ర్యాంక్ సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ స్థానం సాధించడంలో జీవీఎంసీ యంత్రాంగం, స్వచ్ఛ భారత్ అంబాసిడర్‌లు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, సెలబ్రిటీలు, ఆర్‌డబ్ల్యూఎస్, వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలు, నగర పౌరుల కృషి ఉంది. డిప్యూటీ మేయర్లు, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, జీవీఎంసీ అన్ని విభాగాల ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు శుభాకాంక్షలు. ఇదే స్ఫూర్తితో నగరాన్ని మరింత సుందరంగా ఉంచేందుకు అను నిత్యం కృషి చేస్తాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపై ప్రత్యేకంగా దృష్టి సారించి.. అభివృద్ధి చేస్తున్నారు. నగర ప్రజలందరూ భవిష్యత్‌లో కూడా పారిశుధ్య నిర్వహణకు సహకరించాలి. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో విశాఖను మొదటి ర్యాంక్‌లో నిలిపేందుకు అందరం కలిసి ముందుకు సాగుదాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్


నగర ప్రజలకు ఈ అవార్డు అంకితం



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ దేశంలోనే టాప్–5లో నిలవడం గర్వంగా ఉంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చేతులమీదుగా అవార్డు అందుకున్నాం. ఈ అవార్డును నగర ప్రజలకు అంకితం చేస్తున్నాం. విశాఖ నగర ప్రజల సహకారంతోనే ఈ ర్యాంక్ సాధ్యమైంది. ఇందులో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, పాలక మండలి, అధికారులు, సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్, నేవల్, పోలీస్, విద్యాసంస్థలు, ఎన్జీవోల కృషి ఉంది. 2024లో టాప్–1లో నిలిచేందుకు సమష్టిగా శ్రమిస్తాం. కేవలం ర్యాంక్ కోసమే కాకుండా.. ప్రజలకు సౌకర్యవంతమైన, ఆరోగ్యకరమైన జీవనం అందించేందుకు నిరంతరం పాటుపడతాం.

– సాయికాంత్‌వర్మ, జీవీఎంసీ కమిషనర్

ముందస్తు సంక్రాంతి



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్




విజేతలకు బహుమతులు అందిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్

- పశ్చిమలో ముగిసిన పండగ సంబరాలు
- ఆడారి ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహణ
- తిలకించిన వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- ప్రత్యేక ఆకర్షణగా సినీ నటుడు సోహెల్

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గంలో ముందే సంక్రాంతి పండగ వచ్చిందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో గోపాలపట్నం హైస్కూల్ ప్రాంగణంలో గురువారంతో ఘనంగా సంక్రాంతి సంబరాలు ముగిశాయి. ఈ సందర్భంగా వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు బాగుంటే దేశం బాగుంటుందన్నారు. మంచి వాతావరణంలో జరిగిన సంక్రాంతి వేడుకలు చూడముచ్చటగా ఉన్నాయన్నారు. కళాకారుల ప్రదర్శనలు అద్భుతంగా సాగిందని ప్రశంసించారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిగ్‌బాస్ ఫేం సోహెల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తన కొత్త చిత్రం బూట్ కట్ బాలరాజు సినిమాను ఆదరించాలని కోరారు. యలమంచిలి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పిల్లా రమా కుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

దుర్గాభవాని కుటుంబాన్ని ఆదుకుంటాం..



చెక్కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, కోలా గురువులు

కొమ్మాది : గత నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 86వ వార్డు కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన వలంటీర్ కె.దుర్గాభవాని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. గురువారం ఎండాడలో గల జిల్లా పార్టీ కార్యాలయంలో లక్ష రూపాయల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, పార్టీ నాయకుడు జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా నిర్వాసితులకు లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపు

మహారాణిపేట: పరవాడ ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన 40 మంది నిర్వాసితులకు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ లాటరీ ద్వారా ఇళ్ల స్థలాలను (ప్లాట్లను) కేటాయించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జేసీ మాట్లాడారు. ఇళ్ల పట్టాల కోసం లోకాయుక్త ద్వారా 25 మంది నుంచి, స్పందన ద్వారా 15 మంది నుంచి దరఖాస్తులు అందాయన్నారు. ఈ 40 మందికి లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. అనంతరం నిర్వాసితుల సమక్షంలో లాటరీ తీసి, లబ్ధిదారులకు కేటాయించే ప్లాట్ల వివరాలు తెలిపారు. వారికి శుక్రవారం నాటికి పట్టాలను సిద్ధం చేసి, రెండు రోజుల్లోగా పంపిణీ చేస్తామని తెలియజేశారు.

మరో నలుగురికి కరోనా

మహారాణిపేట: విశాఖ జిల్లాలో మరో నలుగురికి కరోనా సోకింది. గడిచిన 24 గంటల్లో 68 మందికి పరీక్షలు చేయగా.. వీరిలో నలుగురికి కరోనా నిర్ధారణ అయింది. 14 మంది హోమ్ ఐసోలేషన్‌లో, ముగ్గురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు 69 మందికి కరోనా పాజిటివ్ వచ్చిందని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు.

సీఎం జగన్ పాలనలో ప్రజలంతా సంతోషం



సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఆనందపురం మండల ప్రజా ప్రతినిధులకు జరిగిన సంక్రాంతి కానుకల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ పథకం వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజలకు చేరిందన్నారు. ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలు ప్రజలంతా గమనిస్తున్నారన్నారు.

ప్రజల ఆశీస్సులతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. ఈ సందర్భంగా రీసర్వే ద్వారా జగనన్న భూహక్కు పట్టాలను చందక పంచాయతీకి చెందిన 10 మంది లబ్ధిదారులకు అందించారు. వైఎస్సార్ సీపీ రీజినల్ యూత్ కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, జీవీఎంసీ విప్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీలు పాండ్రంగి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, నాయకులు బంటుపల్లి మణిశంకర నాయుడు, పిన్నింటి వెంకటరమణ, డోల దేవుడు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

14న సింహగిరిపై సంక్రాంతి సంబరాలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 14న సంక్రాంతి సంబరాలను విశేషంగా నిర్వహిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సంబంధిత ఏర్పాట్లపై గురువారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తెలుగు సంస్కృతిని, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామన్నారు. ఆ రోజు ఉదయం రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో పెద్ద ఎత్తున భోగి మంట వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గొబ్బెమ్మలతో ముత్యాల ముగ్గులు, డూడూ బసవన్నల విన్యాసాలు, జంగమ దేవర, కొమ్ము దాసరి, హరిదాసు వేషధారణలు, కపిలగోవు, ఎడ్ల బండి, పూరిళ్లు, కుండల ప్రదర్శనలు ఉంటాయన్నారు. గోపూజలు నిర్వహిస్తామన్నారు. ఆ రోజు 9గంటలకు చిన్నపిల్లలకు భోగిపళ్లు పోసే కార్యక్రమం నిర్వహిస్తామని, ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లలను సింహగిరిపై ఉన్న నృసింహమండపంలోకి తీసుకురావాలని తెలియజేశారు.

13న ముగ్గుల పోటీలు

సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 13వ తేదీన రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ముగ్గులు వేయాల్సి ఉంటుందన్నారు. మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులను అందజేస్తామని తెలిపారు.

భోగి పర్వదినం సందర్భంగా స్వామికి తొలి పంటలు సమర్పించేందుకు వచ్చే రైతుల కోసం ఉచిత, 100, 300 రూపాయల దర్శన క్యూల వద్ద ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఈవో అధికారులకు సూచించారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, ఈఈలు శ్రీనివాసరాజు, ఏఈవోలు భ్రమరాంబ, పాలూరి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

16న గోశాలలో గో పూజలు

ఈ నెల 16వ తేదీ కనుమ రోజున దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో ఉదయం 9 గంటలకు గోపూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో తెలిపారు.

వైభవంగా సహస్ర ఘటాభిషేకం

- కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు
- 20 వేల మందికి అన్నసమారాధన
- ముగిసిన మార్గశిర మాసోత్సవాలు



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్న ఈవో శిరీష



సహస్ర ఘటాభిషేకం కోసం ఆలయ ప్రాంగణంలో సిద్ధం చేసిన కలశాలు

డాబాగార్డెన్స్‌: విశాఖవాసుల ఆరాధ్య దైవం కనక మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో మార్గశిర మాసోత్సవాలు గురువారంతో వైభవంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా సహస్ర ఘటాభిషేకాన్ని కనులపండువగా జరిపించారు. నెల రోజుల పాటు జరిగిన ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే గాక రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. చివరి రోజైన గురువారం అమ్మవారికి యథావిధిగా శ్రీచక్ర నవవర్ణార్చన, లక్ష్మీహోమం, సామూహిక అష్టోత్తర పూజలు చేశారు. సాయంత్రం 4 గంటలకు ఆలయ ప్రాంగణంలో సహస్ర ఘటాభిషేకం నేత్రపర్వంగా జరిపించారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారి దర్శనాలు నిలిపివేశారు. అభిషేకం అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి మాజీ చైర్‌పర్సన్‌, ఉత్సవ కమిటీ సభ్యులు కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

మార్గశిర మాసోత్సవాల ముగింపు సందర్భంగా 20 వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయ మెయిన్‌రోడ్డు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారి మాల విరమణ

కనకమహాలక్ష్మి మాల ధరించిన భక్తులు దీక్ష విరమణ చేశారు. మహా పూర్ణాహుతి సమర్పించిన అనంతరం మాలను విసర్జించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మాలధారులు పాల్గొన్నారు.

జిల్లాలో 23,639 మందికి జగనన్న తోడు

- లబ్ధిదారుల ఖాతాల్లో రూ.79.20 లక్షల జమ



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జీవీఎంసీ యూసీడీ పీడీ పాపినాయుడు, చిరు వ్యాపారులు

మహారాణిపేట : జిల్లాలోని 23,639 మంది చిరు వ్యాపారులు జగనన్న తోడు ద్వారా లబ్ధి పొందారు. వృత్తి కళాకారులతో సహా చిరు వ్యాపారులు, వీధి వ్యాపారుల ఆదాయాలను మరింత మెరుగుపరచేందుకు నిర్దేశించిన జగనన్న తోడు 8వ విడత నిధుల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బటన్ నొక్కి నిధులను విడుదల చేశారు. వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం జిల్లాలోని అర్హులైన 23,639 మందికి రూ.60.72 లక్షలు వడ్డీ రాయితీ, అదేవిధంగా 17,469 మందికి రూ.18.48 లక్షల కొత్త రుణాల నమూనా చెక్కులను యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేవీ పాపినాయుడుతో కలిసి కలెక్టర్ అందజేశారు.

ఆర్థిక భరోసా లభించింది



భీమిలి మండలం రేఖవానిపాలెంలో నివాసం ఉంటున్నాం. మాది చాలా నిరుపేద కుటుంబం. భర్త సంపాదన అంతంత మాత్రంగానే ఉండేది. ఈ నేపథ్యంలో జగనన్న తోడు మా కుటుంబానికి ఆర్థికంగా భరోసానిచ్చింది. ఎటువంటి పూచీకత్తు లేకుండా బ్యాంకు మంజూరు చేసిన రూ.10వేలతో మా ఇంటి వద్దే బ్యూటీ క్లినిక్ ఏర్పాటు చేసుకున్నా..తద్వారా నేడు నెలకు రూ.10వేలకు పైగా ఆదాయం పొందుతున్నా. నాకు ఇద్దరు పిల్లలు. అమ్మఒడి వచ్చింది. బ్యాంకులో తీసుకున్న రుణం సక్రమంగా తీర్చడంతో సున్నా వడ్డీ లభించింది. అలాగే వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు మూడో విడత కింద రూ.13 వేలు పొందుతున్నాను. తద్వారా నా షాపును మరింత అభివృద్ధి చేసుకోగలనని నమ్మకం కలిగింది. ఇదంతా ముఖ్యమంత్రి ఇచ్చిన ఆర్థి భరోసా వలనే సాధ్యపడింది. – కర్రి కల్యాణి, బ్యూటీషియన్, రేఖవానిపాలెం, భీమిలి మండలం

జగనన్నకు కృతజ్ఞతలు



మాది పొంద్రంగి గ్రామం. నా భర్త వ్యవసాయ కూలి. భర్త సంపాదనతో కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. ఇటువంటి తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న తోడు మా కుటుంబానికి ఎంతో రక్షగా నిలిచింది. బ్యాంకులో రూ.10వేలు రుణం పొంది చిరు వ్యాపారాన్ని ప్రారంభించా. సక్రమంగా రుణం తీర్చడంతో సున్నా వడ్డీ లభించడమే కాకుండా రెండో ఏడాది వచ్చిన డబ్బులతో వస్త్ర వ్యాపారం ప్రారంభించా.. వస్త్రవ్యాపారంతో పాటు కిరాణా షాపు కూడా నిర్వహిస్తున్నాను. తద్వారా నెలకు రూ.12వేలకు పైగా ఆదాయం లభిస్తోంది. మా కుటుంబానికి అండగా నిలబడిన జగనన్నకు కృతజ్ఞతలు.
– పల్లి వరలక్ష్మి, కిరాణా వ్యాపారి, పొంద్రంగి, పద్మనాభం మండలం

ఆత్మచిత్రం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్

సీతంపేట: సీబీసీఐడీ విభాగంలో ఏడీజీగా పని చేస్తున్న కిల్లాడ సత్యనారాయణ అనువాద రచన 'ఆత్మచిత్రం' పుస్తకావిష్కరణ సభ గురువారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. విశ్వ కల్యాణ భారతి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ కేథారనాథ్ సింగ్ కవిత్వాన్ని, నూరు కథలను తెలుగులోకి అనువదించి ఆత్మ చిత్రం పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. ఇటు పోలీస్ అధికారిగా.. అటు కవిగా సమాజానికి చక్కని సాహిత్యంతో పుస్తకాలను అందిస్తున్న రచయిత సత్యనారాయణనను అభినందించారు. రచయిత మాట్లాడుతూ ఎందరో కవులతో సంభాషణలు జరిపి, సాహిత్యంపై అవగాహన పెంచుకుని.. పుస్తకాలను రచిస్తున్నట్లు చెప్పారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ దూబే, బి.ఎస్.కల్యాణి, పి.సుబ్రహ్మణ్యం, భగవంతం పాల్గొన్నారు.

'భూ హక్కుల పరిరక్షణ చట్టాన్ని సవరించాలి'



ఆందోళనలో పాల్గొన్న న్యాయవాదులు

విశాఖ లీగల్: ఆంధ్రప్రదేశ్ భూ హక్కుల పరిరక్షణ చట్టం–22 లోపాలను సవరించే విధంగా కొత్త చట్టాన్ని తీసుకురావాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సీనియర్ సభ్యుడు ఎస్.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. భూ పరిరక్షణ చట్టం రద్దు చేయాలని కోరుతూ విశాఖ న్యాయవాదుల సంఘం, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులు తమ నిరసనను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తెలియజేయడం మంచిదన్నారు. ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ భూ పరిరక్షణ చట్టం లోపభూయిష్టంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావు చట్టం గురించి విపులీకరించిన వీడియోలను కొంతమంది న్యాయవాదులు ప్రదర్శించారు. న్యాయవాదుల శిబిరాన్ని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సందర్శించి, సమస్యను తెలుసుకున్నారు. ఈ చట్టం ప్రస్తుతం అమల్లోకి రాలేదన్నారు. కార్యక్రమంలో విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన యువతరంగం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఓపెన్ క్యూబ్ సీఈవో వినోద్‌కుమార్



అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన

- ఘనంగా ప్రారంభమైన విజ్ఞాన్ 'యువతరంగ్'

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో యువతరంగ్ ఉత్సాహంగా ప్రారంభమైంది. కళాశాల ఆవరణలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలతో అంతటా సందడి నెలకొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓపెన్ క్యూబ్ సీఈవో పి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాల ప్రదర్శనకు యువతరంగ్ చక్కటి వేదిక అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్ మాట్లాడుతూ చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా విభాగాల్లో ప్రతిభను కనబరిచేందుకు యువతరంగ్ దోహదపడుతుందన్నారు.

అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ క్రీడాంశాల్లో పోటీలు హోరాహోరీగా సాగాయి. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మా కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన యువజనోత్సవాలకు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళాశాలల నుంచి 8వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ఫార్మా, మహిళా ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ వై.శ్రీనివాసరావు, బి.అరుంధతి, యువతరంగ్ కన్వీనర్ బి.సతీష్, బి.ప్రసాద్, హరగోవిందరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ బులియన్	
24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.62,830
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,600
వెండి(కిలో):	రూ.77,500

చికెన్ ధరలు	
చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.90
స్కిన్	: రూ.150
స్కిన్‌లెస్	: రూ.160

బస్సులు, రైళ్లు కిటకిట

- సొంతూర్లకు బయలుదేరిన నగరవాసులు
- సందడిగా బస్, రైల్వే స్టేషన్లు





ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్ వద్ద రద్దీగా ప్రయాణికులు



కిటకిటలాడుతున్న రైల్వే స్టేషన్

డాబాగార్డెన్స్‌: ప్రయాణికులతో ద్వారకా బస్టేషన్, విశాఖపట్నం రైల్వే స్టేషన్ గురువారం కిటకిటలాడింది. ఉపాధి నిమిత్తం సుదూర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారంతా సంక్రాంతి పండక్కి తమ స్వగ్రామాలకు బయలుదేరారు. దీంతో ద్వారకాబస్టేషన్, రైల్వేస్టేషన్‌కు ఒక్కసారిగా ప్రయాణికులు పోటెత్తారు. కుటుంబ సభ్యులతో సహా చేరుకున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఏపీఎస్ఆర్టీసీ ద్వారకా బస్టేషన్ నుంచి 250 ప్రత్యేక సర్వీసులను సాధారణ చార్జీలతోనే నడుపుతోంది. విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు 30 ప్రత్యేక సర్వీసులు, విశాఖపట్నం నుంచి విజయవాడకు 60, విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం, రాజాం, పాలకొండ, పార్వతీపురం, సోంపేట, బొబ్బిలి, పలాసకు 100, విశాఖపట్నం నుంచి అమలాపురం, భీమవరంకు 10, రాజమండ్రికి 25, కాకినాడకు 25 బస్సులు తిప్పుతోంది.

హిందీ విభాగం సేవలు భేష్

- డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్



డీఆర్‌ఎం కార్యాలయంలో హిందీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, హిందీ విభాగం సేవలు ప్రశంసనీయమని వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ కొనియాడారు. డివిజన్ పరిధిలో హిందీ భాషా వ్యాప్తి ముఖ్య ఉద్దేశంతో రాజభాషా(హిందీ)విభాగం నూతనంగా రూపొందించిన హిందీ క్యాలెండర్‌ను డీఆర్‌ఎం తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ విభాగం కేవలం హిందీ భాషావ్యాప్తి కోసమే కాకుండా, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధికి సైతం విశేష కృషి చేస్తోందన్నారు. ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు, హిందీ అధికారి వీరేంద్ర ఖాజీల సూచనలతో హిందీ విభాగం ఆఫీస్ సూపరింటెండెంట్ సుదీప్త ఈ హిందీ క్యాలెండర్‌ను రూపొందించారు. హిందీ స్లోగన్స్‌ను క్యాలెండర్‌లో పొందుపరిచారు. అనంతరం ఎలక్ట్రికల్ లోకో షెడ్ వద్ద నిర్మించిన హిందీ లైబ్రరీని డీఆర్‌ఎం ప్రారంభించారు.

వెటరన్ సెయిలర్స్ సమావేశం



వెటరన్ సెయిలర్స్ ఫోరం జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న నేవీ ప్రముఖులు

సింధియా : తూర్పు నావికాదళ పరిధిలోని సాముద్రిక ఆడిటోరియంలో వైజాగ్ చార్టర్ వెటరన్ సెయిలర్స్ ఫోరమ్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి చీఫ్ ఆఫ్ స్టాఫ్ రియర్ అడ్మిరల్ మురళీమోహన్‌రాజు (పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్) అధ్యక్షత వహించారు. విశాఖలోనే కాక చుట్టుపక్కల ఉన్న 300 మంది నౌకాదళ అనుభవజ్ఞులైన నావికులు, సహారా మహిళలు హాజరయ్యారు. సమావేశంలో భాగంగా నావికుల సంక్షేమానికి సంబంధించి ముందస్తు సూచనలతో పాటు వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా పలు అంశాలను చర్చించారు. సహారా మహిళలకు సంబంధించి భవిష్యత్తు ప్రణాళికలను చర్చించారు. ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం సంక్రాంతి స్పెషల్స్

తాటిచెట్లపాలెం: సంక్రాంతి సందర్భంగా పలు స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. శ్రీకాకుళం రోడ్–హైదరాబాద్(07179) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ జనవరి 13వ తేదీ శనివారం సాయంత్రం 5.30గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరి అదేరోజు రాత్రి 8.18గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి రాత్రి 8.20గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.15గంటలకు హైదరాబాద్ వెళ్తుంది. విశాఖ–గుంటూరు(08591) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ శనివారం ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయల్దేరి అదేరోజు సాయంత్రం 3 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గుంటూరు–విశాఖ (08592) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ అదే రోజు సాయంత్రం 5గంటలకు గుంటూరులో బయల్దేరి రాత్రి 11.50 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

శనివారం విశాఖలో బయల్దేరే విశాఖ– విజయవాడ (22701) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ గుంటూరు వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో విజయవాడ– విశాఖ(22702) గుంటూరు నుంచి బయలుదేరుతుంది. విశాఖ–గుంటూరు(22701) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ విశాఖలో ఉదయం 5.20 గంటలకు బయల్దేరి అదే రోజు ఉదయం 11.25గంటలకు విజయవాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 11.35గంటలకు బయల్దేరి మధ్యాహ్నం ఒంటి గంటకు గుంటూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గుంటూరు–విశాఖ (22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ గుంటూరులో మధ్యాహ్నం 4గంటలకు బయల్దేరి సాయంత్రం 5.05 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 5.15 గంటలకు బయల్దేరి రాత్రి 10.55 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై చర్చ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో సీఈవో పోలినాయుడు



సమావేశానికి హాజరైన సభ్యులు,అధికారులు

మహారాణిపేట: సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమివ్వాలని, సామాన్య ప్రజల ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందించాలని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆమె అధ్యక్షతన ఒకటి నుంచి ఏడు వరకు స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. వీటిలో అభివృద్ధి పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, సంక్షేమం, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చించారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తగా ఆయా శాఖల అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ఇప్పటి వరకు తీసుకున్న, చేపట్టనున్న చర్యలను వివరించారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పని చేస్తున్న వారికి అండగా నిలవాలని పేర్కొన్నారు. మైదాన ప్రాంతాల్లో మాదిరిగా పాడేరు, అరకు ప్రాంతాల్లో కూడా మహిళా మార్ట్‌లను ప్రారంభించాలని డీఆర్డీఏ పీడీకి సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల్లో మరింత నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తూ పూడిక తొలగింపు, కాలువలు శుభ్రత చేపట్టాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు త్వరితగతిన మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని చెప్పారు. కొన్ని మండలాల్లో దిగువ స్థాయి అధికారులు, సిబ్బంది పనితీరు బాగోలేదని సభ్యులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవోను ఆదేశించారు. సభ్యుల సూచన మేరకు బెల్టు షాపులపై దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. మినీ గోకులాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

వారంలో బిల్లుల మంజూరు

15వ ఆర్థిక సంఘం కాల పరిధిలో చేపట్టే పనులకు వారం రోజుల్లోపే బిల్లులు మంజూరు చేస్తామని జెడ్పీ సీఈవో ఎం. పోలినాయుడు తెలిపారు. ఆయా పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని కోరారు. ప్రారంభ, మధ్యస్త పనులకు సంబంధించి వేర్వేరుగా ఎం.బుక్‌లు సమర్పించినా బిల్లులు మంజూరు చేస్తామని వెల్లడించారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఇరిగేషన్ విభాగాల్లో చేపట్టే పనులకు అధిక ప్రాధాన్యం ఉంటుందని ఆయన చెప్పారు.

ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలి

పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం బిల్లులు తక్షణం చెల్లించాలని పలువురు సభ్యులు కోరారు. చాలా కాలం నుంచి ఈ బిల్లులు రాలేదని, అలాగే కాంపోనెంట్ కూడా విడుదల కాలేదని అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు, గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నాడు–నేడు పనులకు తక్షణం బిల్లులు మంజూరు చేయాలని పలువురు జెడ్పీటీసీలు కోరారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.